క్లుప్తంగా

రీసర్వే పనులకు నోటీసులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామపంచాయతీలో రీసర్వే పనులకు సంబంధించి రికార్డు పనుల్లో భాగంగా రైతులకు ఫామ్ 9(2) నోటీసులు అందజేసినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు బుధవారం తెలిపారు. గ్రామసచివాలయ పరిధిలో గ్రామసభ నిర్వహించి రీసర్వే పనులపై రైతులకు అవగాహన కల్పించి రైతులకు ఈ నోటీసులు పంపిణీ చేశామన్నారు. నోటీసులు అందుకున్న రైతులు నెల రోజుల వ్యవధిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలపాలన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

బొల్లాపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.... రెండు రోజుల క్రితం సరికొండపాలెం- వెల్లటూరు మార్గమధ్యంలో ద్విచక్రవాహనం, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఇరువురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో సరికొండపాలెం తండాకు చెందిన మూడావత్ పెద హనుమానాయక్ (15) జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రమాదానికి గురైన ఇరువురు విద్యార్థులు వెల్లటూరు హైస్కూల్లో విద్యనభ్యసిస్తున్నారు. స్వగ్రామం సరికొండపాలెం తండా నుంచి వెల్లటూరు హైస్కూల్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తూ పుల్లల చెరువు నుంచి వినుకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు.

సర్వే పనులు పూర్తి చేయాలి

శావల్యాపురం: గ్రామ సచివాలయల్లోని ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా బాధ్యత వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయ ఉద్యోగులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన ఆయుష్మాన్ పురోగతి, గర్భిణులు, బాలికలల్లో రక్తహీనత నివారణకు చర్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటికీ సర్వే చేసి అర్హులను గుర్తించి సమగ్ర వివరాలతో ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. సర్వే పనులు సకాలంలో చేసి మండలాన్ని ప్రథమస్థానంలో ఉండేలా అందరు సహకరించాలన్నారు. ఈసదస్సులో ఈవోపీఆర్డీ పి.సుగుణ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రొంపిచర్ల: మండలంలో వీరవట్నం గ్రామానికి చెందిన గొల్లపూడి ఏసు(46) వ్యక్తి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గొల్లపూడి పార్థివ దేహాన్ని గ్రామ సర్పంచ్ మానుకొండ వాసుదేవరెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న మృతుని భార్య అక్కమ్మకు రూ.5000.00 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కూరపాటి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, హరిబాబురెడ్డి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు

గుంటూరు ఈస్ట్: జిల్లా కారాగార వైద్యశాలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పలుఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు జిల్లా కారాగార పర్యవేక్షణ అధికారి రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మాశిస్టు గ్రేడ్-2 సంబంధించి ఒక పోస్టు ఉంది. వేతనం రూ. 17,500లు, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 సంబంధించి ఒక పోస్టు ఉంది, వేతనం రూ. 17,500లు, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ ఒక పోస్టు వేతనం రూ.12 వేలు వేతనం. నోటిఫికేషన్, దరఖాస్తు ఫారం, జత చేయవలసిన ధృవపత్రాల వివరాలు హెచ్‌టీటీపీ:// గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను గుంటూరు కారాగారం కార్యాలయంలో 9 నుంచి 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్వీకరించడం జరుగుతోందన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా తెలంగాణ మద్యం కలిగిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు బుధవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 48 మద్యం బాటిళ్ల కలిగి ఉన్న మణికంఠను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు సత్కారం

నరసరావుపేట ఈస్ట్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూఢిల్లీలో నిర్వహించిన వేడుకలలో సైనిక కవాతులో ఎన్‌సీసీ విభాగం కవాతులో పాల్గొని తిరిగి వచ్చిన శ్రీసుబ్బారాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ కుందుర్తి కిషోర్‌ను కళాశాల యాజమాన్యం బుధవారం ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు కె.విజయకుమార్, ఎస్.సుబ్బారాయగుప్త మాట్లాడుతూ, ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ నుంచి తమ కళాశాల విద్యార్థి కిషోర్ గణతంత్ర దినోత్సవ వేడుకలో పాల్గొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గౌరవ వందనం నిర్వహించిన కవాతులో ఉండటం పల్నాడుజిల్లాకు గర్వకారణమని తెలిపారు.

సమస్యలు తక్షణమే పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- 16 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ ప్రజలకు అన్నీ విధాలుగా సౌకర్యవంతమైన పాలన అందిస్తామని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని 16 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అములు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. వార్డులో ప్రజలు తెలియజేసిన సమస్యలకు స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వార్డులోని దివ్యాంగురాలైన యక్కటీల నీరజకు పింఛను రావటం లేదని సమస్యను తెలియజేయగా వెంటనే సదరన్ క్యాంపునకు తరలించి పింఛను ఇప్పించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

అలాగే ఇనుప కరెంట్ స్తంభంవల్ల తరచూ షాక్ వస్తుందని, ప్రమాదకరంగా మారిందని సమస్యను వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు చెప్పడంతో వెంటనే నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని విద్యుత్ ఏఈకి సూచించారు. వార్డుకు చెందిన విశ్రాంత ఉద్యోగి కంట్ల వెంకటేశ్వర్లు మీ ప్రభుత్వం హయాంలో వినుకొండకు తాగునీటి సమస్య తీరిందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు బాగున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలన్నారు. గతంలో తాగునీటి సమస్యతో రాష్ట్రంలోనే ప్రథమంగా ఉన్న వినుకొండను తమ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలి, తరువాత తాగునీటి సమస్యలేని ఏకైక పట్టణంగా రాష్ట్ర స్థాయిలో వినుకొండ ఉందని ఇదే తమ పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రజాధనం దోచుకోవడం, పేదల ఆస్తులు ఆక్రమించుకోవడం, ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనారిటీ ఆస్తులు ఆక్రమించడం, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనం దోచుకోవడం తప్ప ఎక్కడా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవన్నారు. వినుకొండలో 130 ఎకరాలల్లో 5వేలకు పైగా జగనన్న కాలనీలో ఇళ్ల ఇర్మాణాలు జరుగుతున్నాయని అడవుల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారని చెబుతున్న టీడీపీ నాయకులు కళ్లుండి చూడలేని గుడ్డివాళ్లలాగా తయారయ్యారని అన్నారు. ఒక్కసారి జగనన్న కాలనీని చూసి మాట్లాడాలన్నారు. అభివృద్ధి చేయడం చేతగాని వారు జరుగుతున్న అభివృద్ధిని చూడలేకపోవటం బాధాకరమన్నారు. ఎవరు ఎన్ని విధాలుగా అడ్డుపడినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండను మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసి తీరుతామన్నారు.

కార్యక్రమంలో 16 వార్డు కౌన్సిలర్ సానాలపుల్లయ్య, పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్ ఖన్నా, కౌన్సిలర్లు ఎంఎస్‌కే బాషా,పాల్వాది ఆంజనేయులు, సుభానీ, నంది నరసింహారావు, పాపాసాని బ్రహ్మయ్య, యారం రామిరెడ్డి, ఎ.జడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, రొడ్డాపుల్లారెడ్డి, సి.హెచ్ నాగరాజు, లతోపాటు మున్సిపల్ కమిషనురు బి.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



బోయపాలెంలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- బోయపాలెంలో రెండోరోజు కొనసాగిన గడపగడపకు కార్యక్రమం
- ముస్లిం వాడలో మంత్రి రజినికి అపూర్వ ఆదరణ

యడ్లపాడు: స్వాతంత్ర్యం వచ్చాకా ఇంత పారదర్శకంగా.. ఇంత పెద్దస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వ ఒక్క వైఎస్సార్‌సీపీయే అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని బోయపాలెం గ్రామంలో రెండోరోజు జరిగిన గడపగడపకు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. తమ ప్రాంతానికి వచ్చిన మంత్రి రజినిని ముస్లిం పెద్దలు, మహిళలు సాదరంగా స్వాగతించారు. ముందుగా పీర్లచావిడి వద్ద మత పెద్దలు ముఖ్యమంత్రి జగన్, మంత్రి రజిని గురించి ప్రత్యేక దువా చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో అందిస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు వివరాలను మహిళలకు వివరిస్తూ ఇంకా సమస్యలు ఏవైనా ఉన్నాయా అంటూ నవ్వుతూ పలకరిస్తూ లబ్ధి వివరాలను వివరించే బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, యువకులు ఎంతో ఉత్సాహంగా ముస్లింవాడలోని పీర్ల చావిడి, వాటర్‌ట్యాంక్ బజార్, గంధం వీధుల్లో పర్యటించారు. స్థానిక మహిళలు వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలతో కూడిన మేనిఫెస్టోను వారి వెబ్‌సైట్ నుంచి తొలగించుకున్నాయని సీఎం జగన్ మాత్రం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన రోజు నుంచి అమలు చేసుకుంటూ వచ్చారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా 95 శాతం అమలు చేసి చూపించారన్నారు. 2024లో భారీ మెజార్టీ లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కీలక భూమి పోషించాల్సి ఉందన్నారు. వీరికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమవంతు సహకారం అందించి జగనన్నకు మద్దతు నివ్వాలని కోరారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్ చైర్మన్ మానుకొండ వీరారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీ, పార్టీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, గ్రామ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు, వంకధారి శ్రీనుబాబు, వీరయ్య, శ్రీనివాసనాయక్, శేఖర్ నాయక్, బింజు బుల్లెయ్య, సాంబశివరావు, షేక్ హుస్సేన్, మోదిన్‌బాష, మస్తాన్‌వలి, చిన్నమస్తాన్, రహంతుల్లా, ఫారుఖ్, హజరత్‌వలి, పల్లపు రవి, షేక్ ఖాదర్‌బాష, అల్లాబక్షు (బుజ్జి) వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఆరేపల్లిలో గడప గడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం



గ్రామ ప్రజలకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఆరేపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. గ్రామంలో గడిచిన మూడున్నరేళ్ల గ్రామంలో రూ.14.19 కోట్ల మేర అభివృద్ధి సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. అలాగే ఐదెకరాల స్థలాన్ని 175 మందికి ఇళ్లపట్టాలు అందజేస్తున్నామన్నారు. కాలనీలో మొత్తం 70 గృహాలను పునర్నిర్మించేందుకు నిధులు మంజూరుకాగా, 13 గృహాల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందన్నారు. రూ.1.12 కోట్ల వ్యయంతో జనజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి మంచినీటి కుళాయిలు అందించేందుకు టెండర్లు పిలుస్తున్నట్లు తెలిపారు. రూ.23 లక్షలతో నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, రూ.30 లక్షలతో సీసీరోడ్లు, రూ.20 లక్షలతో డ్రయినేజీలు, మరో రూ.10లక్షలతో పంటపొలాలకు వెళ్లేందుకు నిర్మాణాలు చేశామన్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, అన్నెంపున్నారెడ్డి, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గడ్డం వెంకటరావు, ముంద్రు హరినారాయణ, గాడిపర్తి సీతయ్య, పానుగోటి వెంకటరావు, గెల్లి చినకోటిరెడ్డి, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, పడాల శివారెడ్డి, గుండాల వెంకటేష్, గ్రామ ఎంపీటీసీ మోతుకూరి వెంకటేష్, సర్పంచు ఇర్లా వెంకటరత్నం, బండారు కొండలు, వాసుదేవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విగ్రహాలకు అధివాస సేవలు



ప్రత్యేక పూజలలో పాల్గొన్న భక్తులు

వినుకొండ టౌన్: పట్టణంలోని పాత మార్కెట్ బజార్, శివాలయం ప్రక్కన ఉన్న చలివేంద్ర ఆంజనేయ స్వామి దేవస్థానం పున: ప్రతిష్ఠ కార్యక్రమాలలో భాగంగా నాల్గవ రోజు బుధవారం విగ్రహాలకు ప్రభాత సేవ, మండప దేవత పూజలు, పుష్పాధివాసము, అనుష్టానములు, ప్రాంత రౌపాసన హోమాలు, వస్త్రాధివాసము, దర్పణాధివాసము, సయ్యాధివాసము, నీరాజనం, మహా మంత్ర పుష్పము నిర్వహించినట్లు ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానంలో గణపతి, సుబ్రహ్మణ్య, సతీసమేత నవగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠా కార్యక్రమాలను అవ్వారి ఉమాశంకర దీక్షితులు శర్మ, వేద పండితుల చేత ఆలయ అనువంశిక అర్చక స్వామి, జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి చంగవల్లి వెంకట శ్రీరామచంద్ర బాబు శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమాలు ఐదు రోజులపాటు నిర్వహిస్తుండగా ఈ నెల 9న యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. చివరి రోజు భక్తులకు అన్న సంతర్పణ జరుగుతుందన్నారు.

అర్హులైన వారికి నివేశన స్థలాలు అందజేయాలి



సర్వేయర్లకు కిట్లను అందజేస్తున్న సంయుక్త కలెక్టర్ శ్యాంప్రసాద్

చిలకలూరిపేటటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హులైన పేదలందరికీ 90 రోజుల్లో ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. బుధవారం ఆయన పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో గ్రామ,వార్డు సచివాలయాలకు సంబంధించి డ్యాష్ బోర్డులను పరిశీలించారు.

మండల పరిధిలోని మురికిపూడి, రాజాపేట, పోతవరం, బొప్పూడి గ్రామాల్లో జరుగుతున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీసర్వే గురించి సమీక్ష నిర్వహించారు.అనంతరం గ్రామ సర్వేయర్లకు స్టేషనరీ, ఫస్ట్‌ఎయిడ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలు అభినందనీయం

తోపుడు బండ్లను పంపిణీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: ఆర్థిక స్తోమతలేని పేద చిరు వ్యాపారులను రోటరీక్లబ్ ఆదుకోవటం అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో రోటరీ చేయూత చక్రాలు కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాదు డెక్కన్, రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీక్లబ్ ఆఫ్ నరసరావుపేట వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను 11మంది పేద చిరు వ్యాపారులకు పంపిణీ చేశారు. దీని ద్వారా అద్దె బండ్ల నుంచి వారికి విముక్తి జరిగి సొంత బండ్ల యజమానులయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా రోటరీ క్లబ్ ప్రత్యేకత చాటుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షులు కపలవాయి రాజేంద్రప్రసాదు, మాజీ గవర్నర్ కేపీ రంగారావు, కార్యదర్శి అచ్యుత్, జమ్ముల రాధాకృష్ణ, ఎం.సుమిత్రకుమార్, మురారిశెట్టి వెంకటేశ్వరరావు, పులిపాటి రమేష్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం కంటే అప్పులు తక్కువే

18వ వార్డులో చేసిన పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ ప్రభుత్వం కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే తక్కువ అప్పులు చేయటం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులు చేస్తోందని వాస్తవానికి విరుద్ధంగా టీడీపీ అనుకూల పత్రికలు గోస పెడుతున్నాయన్నారు. పట్టణంలోని అరండల్‌పేట 18వ వార్డులో సచివాలయ నిధులతో పూర్తిచేసిన అభివృద్ధి పనులకు బుధవారం శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఈసందర్భంగా రిటైర్డు ఉపాధ్యాయుడు కాసు జోజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం వివరించిన ప్రకారం 2019 నాటికి టీడీపీ ప్రభుత్వం రూ.2.96 లక్షల కోట్లు అప్పులు చేయగా, గత మూడున్నరేళ్లలో రూ.1.76 లక్షల కోట్ల అప్పులు మాత్రమే చేసిందన్నారు. మొత్తం కలిపి రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.4.72 లక్షలు కోట్లు చేరిందన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి, రైతు భరోసా, డ్వాక్రా ఆసరా, చేయూ త లాంటి పథకాలేమి అమలు చేయకుండానే చంద్రబాబు నాయుడు రూ.2.96 లక్షల కోట్లు అప్పుచేశాడన్నారు. గత మూడున్నరేళ్లలో కరోనా కష్టకాలంలో కూడా పేదలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా అందరినీ ఆదుకుంటూ రూ.1.92 లక్షల కోట్లు అప్పుచేస్తే దీనిని కూడా అప్పుల ప్రభుత్వమని ప్రచారం చేయటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. స్థానిక పురపాలక సంఘంలో రూ.100 కోట్లు పెట్టి అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.600 కోట్ల సంక్షేమ పథకాల ద్వారా అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఇ డి.శ్రీనివాసరావు, డీఇ ఓ.శ్రీనివాసరావు, డాక్టర్ పాలూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ చేకూరి కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు బత్తుల లక్ష్మీ పద్మలత, యర్రంశెట్టి బాబ్జి, నాయకులు జమ్ముల రాధాకృష్ణ, నవత అంజిరెడ్డి, బొగ్గరం మూర్తి, కాకుమాను మంగపతిరెడ్డి, మల్లెల అశోక్, కందుల ఎజ్రా, కాంట్రాక్టర్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ

రొంపిచర్ల: మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎండీవో కె. మాధ్యూబాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ మాట్లాడుతూ వచ్చే వేసవికాలమును దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ జి. అంకారావు మాట్లాడుతూ రైతులు తమ పొలాలను వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి వివరించారు.

బాధ్యతగా భక్తులకు సేవ చేయాలి

శ్రీ కనకదుర్గ దేవస్థాన కమిటీ సభ్యురాలు కల్యాణికి సూచించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులను సత్కరించిన కల్యాణి, సురేంద్ర తదితరులు

నరసరావుపేట: విజయవాడ శ్రీ కనకదుర్గ దేవస్థాన కమిటీ సభ్యురాలిగా నియమితులైన నిడమానూరి కల్యాణ్ బాధ్యతగా వ్యవహరిస్తూ ఆర్యవైశ్యులకు సేవలు అందజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం తనకు పదవి రావటంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ సుష్మితారెడ్డి దంపతులను కల్యాణి తన భర్త సురేంద్ర, ఆర్యవైశ్య నాయకులతో కలిసి పూలదండలు వేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో అనాదిగా ఉంటూ కష్టపడి పనిచేసినందుకు గుర్తింపుగా సురేంద్రకు ఈఅవకాశం దక్కిందన్నారు. ఇటీవలనే ఆర్యవైశ్య నాయకుడు మిట్టపల్లి రమేష్‌కు పల్నాడు జిల్లా డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పదవి లభించిందని, మిగతా వారికి కూడా సరైన సమయంలో తగిన పదవులు లభిస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో కంజుల రామకోటి రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సాంబశివరావు, ప్రవల్లికా సత్యం, బత్తుల విష్ణు, చిన్ని శ్రీనివాసరావు, దేవిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చిత్రకారుడు జెస్టిస్‌కు అంతర్జాతీయ అవార్డులు



జెస్టిస్‌ను సన్మానిస్తున్న కోనసీమ చిత్రకళా పరిషత్ సభ్యులు

వినుకొండ టౌన్: పట్టణానికి చెందిన చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ 3 అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం జరిగిందని కుటుంబ సభ్యులు బుధవారం తెలియచేశారు. అమలాపురం కోనసీమ చిత్రకళా పరిషత్ వారు అంతర్జాతీయ స్థాయిలో 2020, 2021, 2022 సంవత్సరాలకు నిర్వహించిన చిత్రకళా పోటీలలో ప్రతిభ కనబరిచి, వరుసగా 3 అమరావతి చిత్రకళారత్న, గోల్డెన్ లోటస్ అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు. జెస్టిస్ 3 అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం పట్ల పలువురు ప్రముఖులు, చిత్రకారులు, కళాకారులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షిస్తూ ఆయనకు అభినందనలు తెలియచేశారు.

రేపు రొంపిచర్లలో ప్రతిష్ఠా మహోత్సవం



గణపరంలో దర్శనమిచ్చిన వీరాంజనేయస్వామి

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో పడమటిపాలెంలో నూతనంగా నిర్మించిన అద్దంకమ్మ, పోలేరమ్మ ఆలయాల పునఃప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమాలు ఈ నెల 10న జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాల ఆవరణలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ పునఃప్రతిష్ఠా మహోత్సవ పూజలు నిర్వహించారు.

సాతులూరు ముగిసిన వార్షికోత్సవాలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలోని గ్రామదేవతల ఆలయ వార్షిక వేడుకలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజున ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో సిరిమానోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతైన పోలేరమ్మ, మునిబందమ్మ, వినుకొండ అంకమ్మ, ఊరంకమ్మ, మహాలక్ష్మమ్మ, సీతాలాంబ తల్లి (నాభిశిల)కు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువై ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానం తొలి వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలిరోజు మంగళవారం సువర్చలా సమేత వీరాంజనేయస్వామి కళ్యాణం జరిగిన విషయం విదితమే. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

సుకన్య సమృద్ధి యోజన పథకం బాలికలకు వరం

నరసరావుపేట: పోస్టల్‌శాఖ బాలికల భవిష్యత్ కోసం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం వారికి వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రూ.250లతో పోస్టల్‌లో అకౌంటును ఓపెన్‌చేసి ఏళ్ల వరకు పొదుపు చేసుకున్న డబ్బులకు చక్రవడ్డీతో కలిపి వారి వివాహాలకు ఇచ్చే పథకమే సుకన్య సమృద్ధి యోజన పథకమన్నారు. ఈ మేరకు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో పేద దళిత బాలికలు ఈ పథకంలో చేరేందుకు 100 మందికి అవసరమైన నగదును పోస్టల్‌శాఖ సూపరింటెంట్ పి.వెంకటస్వామికి అందజేశారు. ఈ పథకం నిర్వహణలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం రావాలని సూపరింటెండెంట్‌కు ఆయన సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ ఐపీఓఎస్ శ్రీనివాసులు, పోస్టల్ సిబ్బంది ఆర్.ప్రసన్నాంజనేయరాజు, ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, ఎస్‌సీ సంక్షేమశాఖ జిల్లా మానిటరింగ్ సెల్ సభ్యులు మల్లెల అశోక్, గోపిరెడ్డి యువసేన అధ్యక్షులు పంగులూరి విజయకుమార్, మైలేరి మార్కు, తలారి నాని పాల్గొన్నారు.